క్లుప్తంగా

డంప్ యార్డు ప్రక్షాళన



గుడివాడటౌన్: స్థానిక ఏలూరు రోడ్డులోని మున్సిపల్ డంప్‌యార్డు ప్రక్షాళన కార్యక్రమం చురుగ్గా కొనసాగుతుందని మున్సిపల్ కమిషనర్ వి.మురళీకృష్ణ అన్నారు. గురువారం ఆయన డంప్‌యార్డును పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. మూడు నెలల క్రితం చెత్తను వేరుచేసే ప్రక్రియ ప్రారంభించామన్నారు. కంపెనీ పురపాలక సంఘంతో కుదుర్చుకున్న ఒప్పందం ప్రకారం తొమ్మిది నెలల్లో ఇప్పటి వరకు పేరుకుపోయిన చెత్తను తొలగించి ఖాళీ స్థలాన్ని పురపాలక సంఘానికి అప్పగించాల్సి ఉందని చెప్పారు. అక్కడ జరుగుతున్న పనులను పరిశీలించామని వాహనాల రాకపోకలకు ఏ విధమైన ఇబ్బందులు లేవన్నారు. సాధ్యమైనంత త్వరగా చెత్తను తొలగించి ఆ ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తామన్నారు.

రహదారి నిర్మాణ పనుల పరిశీలన



తోట్లవల్లూరు: ప్రభుత్వ నిబంధనల ప్రకారం సిమెంటు రోడ్ల నిర్మాణ పనులు నాణ్యతగా చేపట్టాలని పంచాయతీరాజ్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఏవీ శ్రీనివాస్ సూచించారు. తోట్లవల్లూరు శివారు అంబేడ్కర్ నగర్‌లో రూ.10 లక్షలతో నిర్మించిన సిమెంటు రోడ్డు నాణ్యతా ప్రమాణాలను గురువారం ఆయన తనిఖీ చేశారు. రోడ్డు నిర్మాణ వివరాలను శ్రీనివాస్ తెలుసుకోవటంతో పాటు వెడల్పు, పొడవు, మందం కొలతలు తీయించారు. గ్రామంలో రూ.32 లక్షలతో నిర్మిస్తున్న మల్టీపర్పస్ హాల్ నిర్మాణ పనులను పరిశీలించారు. శ్లాబ్‌కు వినియోగిస్తున్న ఐరన్ నాణ్యతను శ్రీనివాస్ తనిఖీ చేశారు. పీఆర్ డీఈఈ శ్రీనివాసరావు, ఏఈఈ రాఘవరావు పాల్గొన్నారు.

వలంటీర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

పామర్రు: మండల పరిధిలో ఖాళీగా ఉన్న వలంటీర్ల పోస్టులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు పామర్రు ఎంపీడీవో యద్దనపూడి రామకృష్ణ గురువారం తెలిపారు. స్థానిక కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. మండల పరిధిలో ఖాళీగా ఉన్న ఆరు వలంటీర్ పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. కొమరవోలు – 2, నిభానుపూడి, ఉరుటూరు, ఎలకుర్రు, పామర్రు-4 సచివాలయాల్లో ఒక్కో వలంటీర్ పోస్టు ఖాళీగా ఉందని చెప్పారు. ఆసక్తి, అర్హత గల అభ్యర్థులు ఆన్‌లైన్‌లో ఐఎస్.ఏపీజీవీ.ఏపీసీఎఫ్ఎస్ఎస్.ఐఎన్.పీవోఆర్‌టీపీఎల్ నందు నమోదు చేసుకోవాలని అన్నారు. ఈ నెల 29వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు దరఖాస్తులను అందజేయాలని చెప్పారు. 30న దరఖాస్తుల పరిశీలన, 31న ఇంటర్వ్యూలను మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో నిర్వహిస్తామన్నారు. అభ్యర్థులకు ఎంపిక పత్రాలను సెప్టెంబరు 1వ తేదీన అందిస్తామని తెలిపారు.

నందివాడ మండలంలో నాలుగు ఖాళీలు

గుడివాడటౌన్(నందివాడ): నందివాడ మండలంలోని మూడు గ్రామాల్లో ఖాళీగా ఉన్న వలంటీర్ పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ కేవీ కోటేశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నందివాడలో-2, తమిరిశ, జనార్దనపురంలో ఒక్కో పోస్టు ఖాళీ ఉందన్నారు. అభ్యర్థులు 18 ఏళ్ల నుంచి 35 ఏళ్ల లోపు వయస్సు కలిగి, 10వ తరగతి ఆపై ఉత్తీర్ణులై ఉండాలన్నారు. మహిళలకు 50 శాతం రిజర్వేషన్ ఉంటుందని ఆయన తెలిపారు. ఈ నెల 29వ తేదీ సాయంత్రం 5 గంటల లోగా దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు.

మహిళకు అసభ్య మెసేజ్‌లు

పెడన: ఒక మహిళను సెల్ ఫోన్లలో వేధిస్తున్న వ్యక్తిపై గురువారం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం .. 19వ వార్డుకు చెందిన రత్నకుమారి రెవెన్యూ సెక్రటరీగా విధులు నిర్వహిస్తోంది. అదే వార్డుకు చెందిన ముచ్చు వెంకటసాయి ఆమె ఫోన్‌కు అసభ్య పదజాలంతో కూడిన మెసేజ్‌లను పంపి వాటిని తన ఫోన్‌లో డిలేట్ చేసేవాడు. రత్నకుమారి ఫిర్యాదు మేరకు ఎస్ఐ రవిచంద్రకుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కృష్ణాపురం శ్మశాన భూమి సమస్యపై నివేదిక కోరిన కలెక్టర్

పమిడిముక్కల: గత కొన్నేళ్లుగా శ్మశాన భూమి లేని కృష్ణాపురం కొత్త ఎస్సీ కాలనీ సమస్యపై ఉయ్యూరు ఆర్డీవో, పమిడిముక్కల తహసీల్దార్‌ను నివేదిక సమర్పించాలని కలెక్టర్ రాజబాబు ఉత్తర్వులు జారీ చేశారని సామాజిక కార్యకర్త జంపాన శ్రీనివాసగౌడ్ తెలిపారు. కొత్త ఎస్సీ కాలనీలోని 200 కుటుంబాలకు తరతరాలుగా శ్మశానభూమి లేదని, కృష్ణాపురం-ఐలూరు ఆర్అండ్‌బీ రోడ్డు మార్జిన్ స్థలాన్ని శ్మశానభూమిగా వినియోగిస్తున్నారని తాను రాష్ట్ర లోకాయుక్తకు ఫిర్యాదు చేశారన్నారు. శ్మశానవాటిక నిమిత్తం భూమిని సేకరించి కేటాయించాలని లోకాయుక్త ఆదేశాల మేరకు కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారని చెప్పారు.

నియోజకవర్గ అభివృద్ధికి విశేష కృషి



గుడివాడలో ఆహా క్యాంటీన్‌ను ప్రారంభిస్తున్న ఎంపీ బాలశౌరి, ఎమ్మెల్యే నాని, ప్రజాప్రతినిధులు



అంజుమన్ భవన్‌లో శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎంపీ బాలశౌరి, ఎమ్మెల్యే కొడాలి నాని, నాయకులు

- ఎంపీ వల్లభనేని బాలశౌరి
- పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన

గుడివాడటౌన్: గుడివాడ నియోజకవర్గ ప్రజలు తనకిచ్చిన మద్దతును ఎన్నడూ మర్చిపోనని అందుకు పట్టణం, నియోజకవర్గ అభివృద్ధికి తన వంతు విశేష కృషిచేస్తానని బందరు పార్లమెంట్ సభ్యుడు వల్లభనేని బాలశౌరి తెలిపారు. గురువారం ఆయన ఎమ్మెల్యే కొడాలి నానితో కలిసి పట్టణంలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. స్థానిక పాత మున్సిపల్ కార్యాలయం వద్ద మెప్మా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆహా క్యాంటీన్‌ను ప్రారంభించారు. అనంతరం స్థానిక కైకాల సత్యన్నారాయణ కళామందిరాన్ని పరిశీలించారు. కళామందిరాన్ని సుమారు రూ.80 లక్షలతో అభివృద్ధి చేయడానికి నిధులు కేటాయిస్తానని హామీ ఇచ్చారు. అనంతరం స్థానిక గౌరీశంకరపురంలో ఆరు రోడ్ల కూడలిని అభివృద్ధి చేయడంతో పాటు ట్రాఫిక్ నియంత్రణకు రూ.20 లక్షల నిధులతో ఏర్పాటు చేయనున్న సర్కిల్‌కు ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం స్థానిక పాతబైపాస్ రోడ్డులోని అంజుమన్ భవన్ అభివృద్ధి పనులను ఎంపీ ప్రారంభించారు. ముస్లింలతో కలిసి ప్రార్థనలు నిర్వహించారు.

శరవేగంగా అభివృద్ధి పనులు

ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాని మాట్లాడుతూ అంజుమన్ భవన్ ఒకే అంతస్తు ఉండటంతో ఇబ్బందికరంగా ఉందన్నారు. రూ.20 లక్షలు ఎంపీ నిధులు, రూ.20 లక్షలు మున్సిపల్ నిధులతో మరో అంతస్తు ఏర్పాటు చేస్తున్నామన్నారు. నియోజకవర్గంలో అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయని చెప్పారు. కార్యక్రమాల్లో మున్సిపల్ కమిషనర్ వి.మురళీకృష్ణ, ఎంఈ ప్రవీణ్, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు దుక్కిపాటి శశిభూషణ్, మండలి హనుమంతరావు, పాలడుగు రామ్‌ప్రసాద్, పార్టీ అధ్యక్షుడు గొర్ల శ్రీను, మాజీ కౌన్సిలర్ల మాదాసు వెంకటలక్ష్మి, జ్యోతుల సత్యవేణి, అల్లం సూర్యప్రభ, వీరిశెట్టి నరసింహారావు, చింతల భాస్కరరావు, నందివాడ ఎంపీపీ పెయ్యల ఆదాం, ముస్లిం మైనార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

హిజ్రాల సమస్యలను తక్షణమే పరిష్కరించండి

జాయింట్ కలెక్టర్ అపరాజిత సింగ్

గుడివాడటౌన్: పట్టణంలో నివసిస్తున్న హిజ్రాల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ అపరాజిత సింగ్ ఆదేశించారు. స్థానిక మందపాడు కాలనీలో గురువారం అధికారులతో కలిసి ఆమె హిజ్రాలతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ.. హిజ్రాలను మ్యాపింగ్ చేయాలని, అనేక కారణాల చేత గుడివాడలో నివసిస్తున్న కొందరు హిజ్రాలు మ్యాపింగ్‌కు నోచుకోలేదని, దీంతో వారికి ప్రభుత్వ పథకాలు అందడం లేదన్నారు. ఇటీవల హిజ్రాలు తనను కలిసి వారి సమస్యలు వివరించగా వాటిని పరిష్కరించేందుకు ఈ సమావేశం ఏర్పాటు చేశామన్నారు. ఇప్పటికి మందపాడు కాలనీలో నివసిస్తున్న ఏడుగురు మ్యాపింగ్ అయ్యారని మరో 11 మందికి కూడా మ్యాపింగ్ చేయావలసి ఉందన్నారు. గుడివాడ పురపాలక సంఘంలోని మందపాడు సచివాలయం వలంటీర్ల ద్వారా మిగిలిన 11 మందికి కూడా మ్యాపింగ్ చేసేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ వి.మురళీకృష్ణ తెలిపారు. మ్యాపింగ్ అనంతరం ప్రభుత్వం నుంచి వచ్చే సంక్షేమ పథకాలు అన్ని వారికి వర్తింపజేస్తామన్నారు. సాంఘిక సంక్షేమ శాఖ నుంచి కూడా వీరికి ప్రత్యేక నిధులు అందజేస్తామని చెప్పారు. కార్యక్రమంలో తహసీల్దార్ కె.ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



గుడివాడలో అధికారులతో చర్చిస్తున్న జేసీ అపరాజిత సింగ్

అల్లినగరంలో పెస్ట్ సర్వేలెన్స్

మండవల్లి: మండలంలోని అల్లినగరంలో డిజిటల్ సీఆర్పీ గౌతమ్‌కుమార్ ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయ, రసాయనిక వ్యవసాయ వరి పొలాల్లో సిబ్బంది రైతులతో కలిసి తెగుళ్ల, పురుగులపై నిఘా(పెస్ట్ సర్వేలెన్స్) కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా గౌతమ్‌కుమార్ మాట్లాడుతూ.. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల వలన పురుగుల ఉధృతి పెరిగే అవకాశం ఉందన్నారు. ముందుగా రాజీలేని సూత్రాలు అమలు చేయాలని చెప్పారు. ప్రస్తుతం చేసిన సర్వేలో ప్రకృతి వ్యవసాయ పొలాల్లో ఎటువంటి చీడపీడలు గుర్తించలేదని, రసాయనిక వ్యవసాయ పొలాల్లో ఆకుముడత పురుగును గుర్తించామన్నారు. కార్యక్రమలో మండల ఇన్‌చార్జి నాగ విజయ, ఐసీఆర్పీలు రమేష్, జగన్, నజీర్, రైతులు పాల్గొన్నారు.

దేశ ఖ్యాతిని ఇనుమడింప చేసిన చంద్రయాన్-3

పామర్రు: భారత అంతరిక్ష పరిశోధన సంస్థ(ఇస్రో) ప్రయోగించిన చంద్రయాన్-3 విజయవంతం కావడంపై ప్రజలు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నాయి. మండల పరిధి అడ్డాడ గ్రామంలోని అరవింద ఇంటిగ్రల్ హైస్కూల్ విద్యార్థులు గురువారం పామర్రులో భారీ విజయోత్సవ ర్యాలీ ప్రదర్శనలు చేశారు. జయహో భారత్, ఇస్రో జయహో అంటూ రహదారుల వెంబడి నినాదాలు చేస్తూ జాతీయ భావాన్ని వ్యక్తపర్చారు. స్థానిక నాలుగురోడ్ల కూడలి వద్ద నుంచి ర్యాలీ బయలుదేరి బస్టాండ్ వరకు వెళ్లి తిరిగి కూడలి వద్దకు ర్యాలీ చేరుకుంది. కూడలి వద్ద కొద్ది సేపు నినాదాలు చేశారు. బ్యాండ్ వాయిద్యాలతో పిల్లన గ్రోవిలు ఊదుతూ జాతీయ జెండాలను చేతబూని గ్రామ వీధుల వెంబడి ర్యాలీ నిర్వహించారు.

శాస్త్రవేత్తలకు అభినందనలు

కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పామర్రు ఎంఈవో పద్మసుధ పాల్గొని మాట్లాడుతూ.. చంద్రుని దక్షిణ ధ్రువంలో అడుగు పెట్టిన తొలి దేశం భారత్ కావటం మనందరికీ గర్వకారణమన్నారు. చరిత్ర సృష్టించిన ఇస్రో శాస్త్రవేత్తలను మనమందరం అభినందించాలని చెప్పారు. ఈ మహత్తర విజయం మన శాస్త్రవేత్తల నిర్విరామ కృషి, అంకిత భావానికి నిదర్శనం చెప్పారు. కార్యక్రమంలో అరవింద ప్రిన్సిపాల్ రమణమూర్తి, పామర్రు ఏఎస్ఐ దుర్గారావు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులకు పామర్రు వాసవీ క్లబ్ వాసవీ వనితా క్లబ్ సభ్యుల ఆధ్వర్యంలో బిస్కెట్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో క్లబ్ సభ్యులు ఘంటసాల భరతుడు, పువ్వాడ శ్రీనివాసరావు, ఘంటసాల సాయిరాం, పూటుకూరి పిచ్చేశ్వరరావు పాల్గొన్నారు.



పామర్రులో విజయోత్సవ ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు

కౌమార దశలో జాగ్రత్తలు పాటించాలి



గుడివాడటౌన్: కౌమార దశలో విద్యార్థులు జాగ్రత్తలు పాటించాలని మండల లీగల్ సర్వీసెస్ ప్యానల్ న్యాయవాదులు తెలిపారు. స్థానిక కేకేఆర్ గౌతమ్ స్కూల్‌లో గురువారం 6 నుంచి 8 తరగతుల విద్యార్థులకు అవగాహనా సదస్సు నిర్వహించారు. కౌమార దశలో ఉన్న బాలురు, బాలికలు తెలిసీ తెలియక ప్రవర్తిస్తుంటారని అవి కొన్ని అనర్థాలకు దారితీస్తాయన్నారు. విద్యార్థులు క్రమశిక్షణకు ఉండాలని సూచించారు. పలు చట్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో న్యాయవాదులు షేక్ మహ్మద్ రఫీ, విమలాదేవి, సౌదామణి, వెంకట్రాజు, యామినీదేవి పాల్గొన్నారు.

రహదారి సమస్యకు సత్వర పరిష్కారం



గుంతలమయంగా ఉన్న రహదారి (నాడు)



పూర్తయిన రోడ్డు (నేడు)

12 గంటల్లో రోడ్డు నిర్మాణం, డ్రెయిన్ల ఏర్పాటు

కైకలూరు: చిన్నపాటి వర్షం కురిసినా జాతీయ రహదారి పెద్ద చెరువులా మారుతోంది. ఇరువైపులా డ్రెయిన్లు ఆక్రమణలకు గురవడంతో 15 ఏళ్లుగా ఈ సమస్య పట్టి పీడిస్తోంది. దీంతో ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) ఆదేశాలతో ఆయన కుమారులు వినయ్, శ్యామ్ 12 గంటల్లో రోడ్డుకు పూర్తిగా మరమ్మతులు చేయించారు. పామర్రు – దిగమర్రు జాతీయ రహదారిపై కొత్త పెట్రోలు బంకు నుంచి నిమ్మగడ్డ నాగభూషణం ప్రభుత్వ ఉన్నత పాఠశాల వరకు వర్షపు నీటితో రోడ్డు పూర్తిగా దెబ్బతింది. విద్యార్థులు అనేక ఇబ్బందులకు గురవుతోన్నారు. ఇటీవల ఇక్కడ గుంతల్లో ఇరువురు వాహనాలపై క్రింద పడి ఆస్పత్రి పాలయ్యారు. ఈ సమస్యలపై సమీపంలో నివాసముంటున్న ఉపాధ్యాయుడు మార్నెళ్ల రవిశంకర్ ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా, ఆయన ఆదేశాలతో సత్వరం పనులు చేపట్టారు. రోడ్డును పూర్తి చేసిన అనంతరం ఇరువైపులా నూతన డ్రెయిన్లను తవ్వించారు. దీంతో ఎన్నో సంవత్సరాలుగా ఎదుర్కొంటున్న సమస్యకు పరిష్కారమైంది. ఎంపీపీ అడివి కృష్ణ, నేతలు తలారి జాన్, కూనవరపు సతీష్, మదన్, రాజా, వి.విజయ్‌కుమార్, రవి, శేషు పనులను పరిశీలించారు.



జరుగుతున్న రహదారి నిర్మాణ పనులు

విద్యార్థుల హర్షం..

కొత్త పెట్రోలు బంకు సమీపంలో ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల, నిమ్మగడ్డ నాగభూషణం ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కాలేజీ, వైవీఎన్నార్ ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ఉన్నాయి. దీంతో ప్రతీ రోజు వేలాది మంది విద్యార్థులు ఈ రోడ్డుపై ప్రయాణించాల్సి వస్తోంది. వర్షం వస్తే కనీసం సైకిళ్లు కూడా వెళ్లలేని పరిస్థితి ఉండేది. విద్యార్థులు పడుతున్న సమస్యను గుర్తించి రోడ్డు, డ్రెయిన్లు ఏర్పాటు చేయడంపై పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

చల్లపల్లి: బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి అన్నారు. బాల్య వివాహాల నిరోధక చట్టంపై అవగాహన సదస్సు గురువారం స్థానిక చల్లపల్లి నారాయణరావు నగర్ కాలనీలోని ప్రభుత్వ ఎస్సీ బాలికల గురుకుల కళాశాలలో నిర్వహించారు. సర్పంచ్ మాట్లాడుతూ బాల్యంలో వివాహాలు జరిగితే ఆర్థికంగా, చట్టపరంగా, శారీరకంగా ఎదురయ్యే ఇబ్బందులను వివరించారు. ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలు సద్వినియోగం చేసుకుని విద్యార్థి దశలో మంచి ప్రతిభ చూపి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని సూచించారు. పంచాయతీ ఈఓ పేర్ని మాధవేంద్రరావు, ప్రిన్సిపాల్ శాంతి విశాల, మహిళా పోలీసులు, ఉపాధ్యాయినులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

పామర్రు: స్థానిక ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ కార్యాలయంలో బాధిత కుటుంబానికి రూ.1.40 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కును గురువారం అందజేశారు. పామర్రు మండల పరిధిలోని పోలవరం గ్రామానికి చెందిన చల్లర నరసమ్మ కుటుంబానికి వైద్య ఖర్చుల నిమిత్తం ముఖ్యమంత్రి సహాయనిధి(సీఎంఆర్ఎఫ్) నుంచి రూ.1.40 లక్షల చెక్ మంజూరైంది. దీంతో పామర్రు ఎంపీపీ దాసరి అశోక్‌కుమార్, జెడ్పీటీసీ కె.స్వరూపరాణిలు మాట్లాడుతూ బాధిత కుటుంబాలను ఆదుకోవడంలో ప్రభుత్వం ఎప్పుడూ ముందు ఉంటుందన్నారు. ఎవరూ అధైర్య పడవద్దని ప్రభుత్వం అండగా ఉంటుందని చెప్పారు. వీరితో పాటు ఉండ్రపూడి వీరాంజనేయస్వామి దేవస్థానం చైర్మన్ మట్టా పూర్ణచంద్రరావు లబ్ధిదారులకు చెక్‌ను అందజేశారు. కార్యక్రమంలో పోలవరం గ్రామ సర్పంచ్ మట్టా శ్రీలక్ష్మి పాల్గొన్నారు.



చెక్ అందజేస్తున్న ఎంపీపీ అశోక్, జెడ్పీటీసీ స్వరూపరాణి

అనాథకు పెళ్లి సామగ్రి వితరణ

కొమరవోలు(పామర్రు): అనాథ అయిన వధువు వివాహానికి పామర్రు వైస్ ఎంపీపీ ఆరుమళ్ల రమాదేవి పెళ్లి సామగ్రి గురువారం అందజేసి తన ఉదారతను చాటుకున్నారు. వివరాల్లోకి వెళ్తే మండల పరిధి కొమరవోలు గ్రామంలో తల్లిదండ్రులు లేక ఆర్థిక స్తోమత లేని అమ్మమ్మ వద్ద ఉంటున్న వేములవాడ ఉమామహేశ్వరికి వివాహం నిశ్చయమైంది. కాని ఆమె వద్ద ఆర్థిక స్తోమత లేక ఇబ్బందులు పడుతోంది. ఈ విషయాన్ని గ్రహించిన స్థానిక ఎంపీటీసీ కారుమంచి నాగమల్లేశ్వరరావు వధువు సమస్యను పామర్రు ఎంపీపీ దాసరి అశోక్‌కుమార్‌కు, వైస్ ఎంపీపీ ఆరుమళ్ల రమాదేవికి వివరించారు. తక్షణమే స్పందించిన పామర్రు వైస్ ఎంపీపీ ఆరుమళ్ల రమాదేవి నూతన వధువుకు పెళ్లి చీరలు, పసుపు, కుంకుమ, రూ.5 వేల నగదును అందజేశారు. దీనితో వారి కుటుంబంలో ఆనందం వెల్లివిరిసింది. కార్యక్రమంలో రాష్ట్ర పార్టీ నాయకులు దొంతిరెడ్డి శ్రీరామిరెడ్డి, గ్రామస్తులు కాకరాల కోటేశ్వరరావు, ఉప సర్పంచ్ బొడ్డు సురేష్, స్థానికులు మల్లికార్జునరావు, పోతురాజు, వరాలు, జార్జీ, వానారావు, బుజ్జి, బాబూరావు పాల్గొన్నారు.



పెళ్లి సామగ్రిని అందజేస్తున్న వైస్ ఎంపీపీ రమాదేవి తదితరులు

ప్రజలకు మెరుగైన వైద్యసేవలు

గుడివాడటౌన్: పట్టణంలో ఏర్పాటు చేసిన అధునాతన ఆస్పత్రులు నియోజకవర్గ ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించాలని గుడివాడ ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని) అన్నారు. స్థానిక గౌరీశంకరపురంలో నూతనంగా ఏర్పాటు చేసిన సాయి శ్రియాన్ కిడ్నీ అండ్ స్కిన్ కేర్ సెంటర్‌ను ఆయన గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాని మాట్లాడుతూ.. అధునాతన హంగులతో గుడివాడలో ఆస్పత్రులు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. గత కొన్నేళ్లుగా ఇక్కడ వైద్య సేవలందిస్తున్న డాక్టర్ పెరుమాళ్ల కేశవరావు కుమారుడు డాక్టర్ పెరుమాళ్ల సందీప్ ఈ నూతన ఆస్పత్రి ప్రారంభించడం శుభసూచకమన్నారు. కార్యక్రమంలో విశ్వభారతి విద్యాసంస్థల అధినేత పొట్లూరి శ్రీమన్నారాయణ, డాక్టర్ ఎల్ఎస్ రాజా, ఐఎంఏ అధ్యక్ష కార్యదర్శులు డాక్టర్ పాలడుగు వెంకట్రావు, డాక్టర్ భవానిశంకర్, పట్టణానికి చెందిన పలువురు వైద్యులు, ఆర్యవైశ్య ప్రముఖులు పాల్గొన్నారు.



ఆస్పత్రిని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కొడాలి నాని, శ్రీమన్నారాయణ తదితరులు

శ్రీనివాసరావు మృతి పార్టీకి తీరని లోటు

పామర్రు: పామర్రు గ్రామ పంచాయతీ ఆరో వార్డు మెంబరు, వైఎస్సార్ సీపీ నాయకుడు నవుడు శ్రీనివాసరావు అలియాస్ కిట్టు(54) మృతి పార్టీకి తీరని లోటని పామర్రు శాసనసభ్యుడు కైలే అనిల్‌కుమార్ అన్నారు. బుధవారం రాత్రి ఆయన మృతిచెందారు. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే కైలే కిట్టు మృతదేహాన్ని గురువారం ఉదయం సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీ ఉన్నతి కోసం కిట్టు చేసిన కృషి అభినందనీయమన్నారు. పార్టీలో కీలక వ్యక్తిగా ఉంటూ పార్టీ ఎదుగుదలకు పాటుపడ్డారని చెప్పారు. అనంతరం కిట్టు కుటుంబ సభ్యులను ఓదార్చి వారికి తన ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ డి.అశోక్‌కుమార్, వైస్ ఎంపీపీ ఆరేపల్లి శ్రీనివాసరావు, గ్రామ సర్పంచ్ కె.కస్తూరి, ఉప సర్పంచ్ దేవిరెడ్డి బాల వెంకటేశ్వరరెడ్డి, ఎంపీటీసీ తాడిశెట్టి శ్రీనివాసరావు, నాయకులు చౌదరి, నాగేంద్రరావు తదితరులు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే అనిల్‌కుమార్

న్యాయవాది పాండురంగారావు మృతికి నివాళి

గుడివాడటౌన్: పట్టణానికి చెందిన ప్రముఖ న్యాయవాది ఎస్వీ పాండురంగారావు మృతికి న్యాయవాదులు నివాళులర్పించారు. స్థానిక కోర్టు భవనంలో గురువారం గుడివాడ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన సంతాప సభలో పలువురు వక్తలు మాట్లాడుతూ.. న్యాయవాదిగా పాండురంగారావు చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు టి.శ్రీనివాసరావు, సీహెచ్ వెంకటరమణ, ఉపాధ్యక్షుడు కుటుంబరావు, న్యాయవాదులు సజ్జా శివరామకృష్ణ, కొడాలి హరినాథ్, ఎండీ రఫీ, యశోద యామినీదేవి, కమలామృతం, నీలం బెంజిమెన్, గంటా రమేష్ మనోహర్, ఇక్బాల్, లక్ష్మీనారాయణ, దగాని సత్యన్నారాయణ, గడ్డమణుగు అప్పాజీ తదితరులు పాల్గొని సంతాపం తెలిపారు.



మౌనం పాటిస్తున్న న్యాయవాదులు

విద్యార్థులకు హిమోగ్లోబిన్ పరీక్షలు

తోట్లవల్లూరు: పౌష్టికాహారంతోనే రక్తహీనత నివారణ సాధ్యమని తోట్లవల్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ సాయిప్రసన్న తెలిపారు. స్థానిక జెడ్పీ పాఠశాలలో విద్యార్థులకు గురువారం హిమోగ్లోబిన్ పరీక్షలను ఆరోగ్య సిబ్బంది నిర్వహించారు. రక్తహీనత వల్ల అలసట, నాలుక, కనురెప్పల లోపలి భాగం పాలిపోయి ఉండటం, చికాకు, ఆకలి లేకపోవటం, కళ్లు తిరగటం, అరచేతుల్లో చెమట పట్టడం వంటి లక్షణాలు కనిపిస్తాయన్నారు. ఆకుకూరలు, మామిడి, నిమ్మ, నారింజ, కర్జూరం, బీట్‌రూట్ జ్యూస్, పాలకూర, కొత్తిమీర, మునగాకు ఎక్కువగా తీసుకోవాలని సూచించారు. ఎంపీహెచ్ఈఓ మాణిక్యం, ఎంఎల్‌హెచ్‌పీ కృష్ణవేణి, హెల్త్ అసిస్టెంట్ శివరామకృష్ణ, ఆరోగ్య కార్యకర్తలు కమలాక్షి, కిరణ్‌కుమారి, అనిత, ప్రసన్న, శైలజ, రాజేశ్వరి, సురేఖ, ఉపాధ్యాయులు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.



విద్యార్థినులకు రక్త పరీక్షలు నిర్వహిస్తున్న ఆరోగ్య సిబ్బంది

పాడి రైతులకు బోనస్ పంపిణీ

నాగాయలంక: స్థానిక పాల ఉత్పత్తిదారుల సహకార సంఘంలో పాలు పోసిన 67మంది రైతులకు కృష్ణా మిల్క్ యూనియన్ ఆధ్వర్యంలో రూ.99,624లను గురువారం అందజేశారు. పామర్రు పాల శీతల కేంద్రం మేనేజర్ చిట్టూరి దామోదరకృష్ణ గోపీనాథ్, సంఘ అధ్యక్షుడు తలశిల బాబూరావు, రూట్ సూపర్‌వైజర్ ఎం.వరప్రసాద్, సంఘం పాలకవర్గ సభ్యులు, రైతులు పాల్గొన్నారు.